క్లుప్తంగా

ఈట్ స్ట్రీట్ పనుల పరిశీలన

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో రాజీవ్ పార్కు రోడ్ వద్ద ఏర్పాటు చేయబోయే ఈట్‌స్ట్రీట్‌కు సంబంధించిన స్థలాన్ని కమిషనర్ మనోజ్‌రెడ్డి పరిశీలించారు. సోమవారం రెవిన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు ఇస్తూ, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. దుకాణాల ఏర్పాటుకు త్వరలోనే ఈ దుకాణాల ఏర్పాటు కోసం వేలం నిర్వహిస్తామన్నారు. అనంతరం 26వ డివిజన్ లోని మాసాపేట 1, 2 సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించి, సిబ్బందితో సమావేశమయ్యారు. సిబ్బంది కొరతతో పాటు కంప్యూటర్లు సరిగా పనిచేయకపోవడంపై వారు తమ వినతులు తెలియజేయగా, కమిషనర్ సంబంధిత అధికారులతో వెంటనే చర్చించి సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో బాలాజీ నగర్, కాగితాల పెంట ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువను పరిశీలించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కడప అర్బన్: కడప నగరంలో సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం జొమాటో డెలివరీ బాయ్స్ కు సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మధు మల్లేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు విస్తృతంగా జరుగుతున్నాయని, ముఖ్యంగా డెలివరీ బాయ్స్ వంటి యువతను లక్ష్యంగా చేసుకొని మోసగాళ్లు వివిధ రకాలుగా మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేకంగా యుపిఐ మోసాలు, ఫిషింగ్ లింకులు, నకిలీ కస్టమర్ కాల్స్, ఓటిపి షేరింగ్ మోసాలు వంటి అంశాలపై సైబర్ క్రైమ్ సీఐ వివరంగా అవగాహన కల్పించారు. ఏటువంటి పరిస్థితుల్లోనూ బ్యాంక్ వివరాలు, ఓటిపి, పాస్‌వర్డ్స్ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు.

పరిసరాల పరిశుభ్రత

కడప ఎడ్యుకేషన్: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యకర వాతావరణంలో విద్యాభ్యాసం సాధ్యమవుతుందని డా. కె. శ్రీనివాసరావు తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం జాతియా సేవ పథకం స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా, విశ్వవిద్యాలయ పరిధిలో సోమవారం నిర్వహించిన శుభ్రత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సి. నారాయణ రెడ్డి , పలువురు వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందన



సురేష్‌బాబును అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎం వి సురేష్ బాబుకు రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు 2025 లభించినందుకు సోమవారం కళాశాల ప్రిన్సిపల్, వృక్ష శాస్త్ర విభాగం అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. వృక్ష శాస్త్ర విభాగంలో సురేష్‌బాబు కృషికి ఈ అవార్డు లభించడం ఎంతో అభినందనీయమని కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ అన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్, వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌సీఎం టీచర్ పోస్టుల భర్తీలో అక్రమాలు

కడప సెవెన్‌రోడ్స్ : రోమన్ క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో గత సంవత్సరం భర్తీ చేసిన 26 టీచర్‌పోస్టుల్లో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మాతయ్య మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్‌లు మాట్లాడుతూ డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, అప్పటి ఏడీ మునీర్‌ఖాన్ డబ్బులకు అమ్ముడుపోయి రోస్టర్ నిబంధనలు పాటించకుండా పోస్టులు భర్తీ చేశారన్నారు. ఆర్‌సీఎం ఎయిడెడ్ పాఠశాల డీజీఎం జాన్సన్ కనుసన్నల్లో పోస్టుల భర్తీ జరిగిందన్నారు. ఒక్కో పోస్టుకు రూ. 15–20 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఓబయ్య, ఎస్వీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రణభేరిని జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ సెప్టెంబర్ 15 నుండి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న యూటీఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు పిలుపు నిచ్చారు. సోమవారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో రణభేరి కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు కార్యదర్శులు పాల్గొన్నారు.

చంద్రబాబు చెప్పినవన్నీ అబద్ధాలే



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, చిత్రంలో మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



సమావేశంలో పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కడప కార్పొరేషన్: సీఎం చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనని మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు అన్నారు. సోమవారం స్థానిక న్యూ సంఘం కళ్యాణ మండపంలో నిర్వహించిన వెస్ట్ జోన్ విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ ఈవీఎంల మోసం వల్లే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి రావడానికి అనేక హామీలిచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు అధికారంలోకి వచ్చాక హామీల అమలుపై శ్రద్ధ వహించకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చే ఒక్క పథకం లేదన్నారు. ఆయన పేరు చెబితే వెన్నుపోటు, మోసం గుర్తుకు వస్తాయన్నారు. పిల్లనిచ్చిన మామనే వెన్నుపోటు పొడిచిన బాబుకు ప్రజలెంత అని ప్రశ్నించారు. ఆడబిడ్డనిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని టీడీపీ మంత్రి మాట్లాడటం దారుణమన్నారు. హామీ ఇచ్చినప్పుడు తెలీదా రాష్ట్ర బడ్జెట్ అంత లేదని నిలదీశారు. 20లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని, పదిహేను నెలల్లో ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని, కోటి మంది నిరుద్యోగులు భృతి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, మొదటి ఏడాది ఒక్క సిలిండర్ మాత్రమే ఇచ్చారన్నారు. చాలామందికి అకౌంట్లలో డబ్బులు పడలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని చెప్పి వారిని మోసం చేశారని, కొన్ని సర్వీసుల్లోనే ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 సీట్లు గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు.

– ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బాబూ ష్యూరిటీ మోసం గ్యారెంటీ ప్రోగ్రాంను డివిజన్ స్థాయిలోకి తీసుకుపోవాలన్నారు. తద్వారా ప్రభుత్వం చేసే మోసాలను ప్రజలకు వివరించారు. అనంతరం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్, వెస్ట్ జోన్ అధ్యక్షుడు నాగమల్లారెడ్డి, జోన్ అధ్యక్షులు బీహెచ్ ఇలియాస్, ఐస్‌క్రీం రవి, రామ్మోహన్‌రెడ్డి, దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య, జి.శ్రీనివాసులరెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ, పత్తి రాజేశ్వరి, షేక్ షఫీ, ఎస్ఎండీ షఫీ, మూలే సరస్వతి, బి.మరియలు, నారాయణమ్మ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : అధిక ఫీజులు వసూలు చేస్తున్న బీరం శ్రీధర్‌రెడ్డి జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు కోరారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్సెల్‌లో జెడ్పీ సీఈఓ ఓబులమ్మను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నగర నాయకులు భార్గవ్, అలీహసేన్, సాహిల్, వర్మ, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు

కడప ఎడ్యుకేషన్: కడపలోని ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజ్‌లో సోమవారం ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అనే అంశంపైన జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీం బాషా మాట్లాడుతూ ఇంటర్నెట్ సదుపాయం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎక్కువగా ఉపయోగించే ఈ రోజుల్లో ఈ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరికి ఉందని తెలియజేశారు. ఐ కే సి కోఆర్డినేటర్ డాక్టర్ సివి కృష్ణవేణి మాట్లాడారు. ఈ సదస్సుకు లెఫ్టినెంట్ డాక్టర్ జి రంగనాథన్, అసోసియేట్ ప్రొఫెసర్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటక మరియు గవర్నమెంట్ మెన్స్ కాలేజ్ అటానమస్ అనంతపూర్ జువాలజీ అధ్యాపకులు డాక్టర్ జి రాజశేఖర్ రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ఐఐఎస్సీ కోఆర్డినేటర్ డాక్టర్ కె ప్రకాష్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ల ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్: కడపలోని యూటీఎఫ్ భవన్‌లో సెప్టెంబర్ 10వ తేదీ సాయంత్రం 5.30 కి జరిగే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల సెమినార్ ను జయప్రదం చేయాలని సేవ్ పబ్లిక్ సెక్టర్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి, ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ సంఘాల సమన్వయ కమిటీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, అజీజ్, అవధానం శ్రీనివాస్, లక్ష్మి రాజా, మహేష్, జగదీష్, లలిత పిలుపునిచ్చారు. సోమవారం ఎల్ఐసి యూనియన్ కార్యాలయ ఆవరణలో సెమినార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అక్బర్ బాషా, అయ్యవారు రెడ్డి, వారిజాతమ్మ, రాజు, కుమార్, కిషోర్, సాదక్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నిరసన విజయవంతం చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి పట్ల ఉద్యోగుల్లో చైతన్యం కలిగించడంలో భాగంగా ఏపీటీఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా వారంరోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యామ్ సుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సోమవారం కడపలోని జెడ్పీ ఆవరణలో ఏపీటీఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 జనవరి నుండి పెండింగులో ఉన్న నాలుగు విడతల డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. ఇంకా పలు సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యూఎస్ఏ జర్నల్‌కు ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా సుధాకర్ రెడ్డి



డాక్టర్ సుధాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: గవర్నమెంట్ కాలేజ్ ఫర్ మెన్ (అటానమస్)లో ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ) సైన్స్ పబ్లిషింగ్ గ్రూప్ నిర్వహిస్తున్న జర్నల్ ఆఫ్ ఫోటోనిక్ మెటీరియల్స్ అండ్ టెక్నాలజీకి ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపినారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ రెడ్డిని ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. వెంకట సుబ్బయ్య, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. సురేష్ బాబు, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఆర్. నీలయ్య, బోధనా సిబ్బంది మరియు బోధనేతర సిబ్బంది డాక్టర్ సుధాకర్ రెడ్డిని అభినందించారు.

అక్షరాస్యతతోనే సమాజాభివృద్ధి సాధ్యం



జ్ఞాపికలు అందుకున్న విద్యార్థినులతో రిజిస్ట్రార్, డీఆర్ఓ, తదితరులు



మాట్లాడుతున్న వీసీ విశ్వనాథ్‌కుమార్

కడప కోటిరెడ్డి సర్కిల్ : అక్షరాస్యతతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని యోగివేమన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ వి.సలీంబాషా అధ్యక్షతన 59వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తా పద్మ మాట్లాడుతూ మహిళ చదువుకుంటే కుటుంబం బాగుపడుతుందన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అక్షరాస్యతలో భాగం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అక్షరాస్యత కేవలం చదవడం కాదని, పౌర జీవనానికి మార్గదర్శి అన్నారు. ఎస్ఎస్ఏ పీఓ నిత్యానందరాజు మాట్లాడుతూ అక్షరాస్యతతో వ్యక్తి తన హక్కులు, కర్తవ్యాలు అర్థం చేసుకుంటారని తెలిపారు. వయోజన విద్య ఉప సంచాలకులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ చదువుకున్న వారే సమాజానికి మార్గదర్శి అవుతారని సూచించారు. సూపర్‌వైజర్ సోమశేఖరరెడ్డి , సూపర్‌వైజర్ మాధవీలత , సర్వశిక్షా అభియాన్ ఏఎంఓ వీరేంద్ర మాట్లాడారు. అనంతరం హాజరైన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కేశవరెడ్డి, ఆశాలత, సుబ్బారెడ్డి, సుధారాణి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో అక్షరాస్యత దినోత్సవం

కడప ఎడ్యుకేషన్: డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షరాస్యత ప్రాముఖ్యత, సమాజ నిర్మాణంలో దాని పాత్ర మరియు సాంస్కృతికపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్–చాన్సలర్ ప్రొఫెసర్ జి. విశ్వనాథ్ కుమార్ హాజరై ప్రసంగిస్తూ ఆధునిక సాంకేతికత విద్యా రంగంలో కలిగిస్తున్న మార్పులను, విభిన్న కోర్సుల మధ్య ఉన్న పరస్పర అనుసంధానం, సౌలభ్యం విద్యార్థుల సమగ్ర అభ్యాసానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. యూనివర్సిటీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సర్వ శిక్షా అభియాన్ దేశంలో అక్షరాస్యత పెంపుదలకు అందించిన విశేష సేవలను వివరించారు. అదనపు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ జి. ఫణీంద్ర రెడ్డి , డాక్టర్ కృష్ణ స్వామి, పెయింటింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ బరుణ్ మండల్ తదితరులు మాట్లాడారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : వేంపల్లె గ్రామ పంచాయతీ కార్మికులకు 15 నెలల పీఎఫ్‌తోపాటు ఆరు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా మాట్లాడుతూ వేతనాల కోసం ఐదు రోజులుగా పంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా పారిశుద్ధ్య సేవలు అందిస్తున్న కార్మికులకు, తాగునీటి సరఫరాలో పనిచేస్తున్న సిబ్బందికి న్యాయం చేయాలన్నారు. 15 నెలల కార్మికుల వేతనాల నుంచి కటింగ్ చేసినప్పటికీ పీఎఫ్ డబ్బులు ఎందుకు జమచేయలేదని ప్రశ్నించారు. సమయం అయిపోయినా ఎల్ఐసీ డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. కార్మికుల వేతనాలు బ్యాంకు అకౌంట్లలో జమ చేయాలని, కనీస వేతనాలు వర్తింపజేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాయుడు, మద్దిలేటి, మున్సిపల్ వర్కర్స్ నాయకులు గోవిందు, తారక రామారావు, నరసింహులు, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

కూటమి సర్కారుది పైశాచిక ఆనందం

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగంలో కోర్టు తీర్పులు కూడా అమలు కాని పరిస్థితి నెలకొందని, దీనికోసం న్యాయవాదులు సైతం బైఠాయించాల్సిన దుస్థితి దాపురించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ అధికారులు పి. క్రిష్ణమోహన్ రెడ్డి, కె. ధనుంజయ రెడ్డి, వికాట్ కంపెనీ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలకు ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ వారు జైలు నుండి విడుదల కాకుండా ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. బెయిల్ వచ్చినా తీవ్ర ఆలస్యం చేసి విడుదల కాకుండా అడ్డుకోవడం అప్రజాస్వామ్యమన్నారు. కూటమి సర్కారుకు కోర్టు తీర్పులు, చట్టాలు లెక్కలేదని మరోసారి నిరూపించారన్నారు. లేని లిక్కర్ స్కాంను ఉన్నట్లు సృష్టించారని, వైఎస్సార్‌సీపీ అగ్రనాయకులను జైలుకు పంపి పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. శనివారం సాయంత్రం ముగ్గురు అధికారులకు బెయిల్ వచ్చినప్పటికీ ఉదయం తొమ్మిది గంటల వరకు వారిని అక్రమంగా జైల్లో ఉంచడం కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు శివకుమార్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

యువతను ఆకట్టుకునేలా కేటీఎమ్ డ్యూక్ 160 బైక్



నూతన బైక్‌ను పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష, మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్ : యువతను ఆకట్టుకునేలా కేటీఎమ్ కంపెనీ తన కొత్త బైక్ 160 డ్యూక్‌ను మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష, నగర మేయర్ సురేష్‌బాబు మార్కెట్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది కేటీఎమ్ సిరీస్‌లో అత్యంత తక్కువ ఖరీదుగల మోడల్ అని తెలిపారు. స్పోర్టీ లుక్స్‌తో, పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో ఈ బైక్ 160సీసీ సెగ్మెంట్‌లో యువతకు కొత్త రైడింగ్ అనుభవాన్ని అందిస్తుందని వివరించారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ బైక్ ఎక్స్–షోరూమ్ ధర రూ. 1.85 లక్షల నుంచి ప్రారంభమవుతుందని వివరించారు. ఇందులో 160సీసీ సింగిల్–సిలిండర్, లిక్విడ్–కూల్డ్ ఇంజిన్ ఉంటుందని, ఇది 15.5 బీహెచ్‌పీ శక్తిని, 14 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుందన్నారు. ఆరు–స్పీడ్ గేర్‌బాక్స్‌తో జతచేయబడిందన్నారు. డైనమిక్ డిజైన్, స్పోర్టీ లుక్, ఆకర్షణీయమైన ఆరెంజ్ రంగులో ఇది లభిస్తుందని, యువ రైడర్లను ఆకట్టుకునేలా దీని డిజైన్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం మేనేజర్ పరమేష్, సుబ్రమణ్యం, మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆర్ఎస్ఎఫ్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేశు యాదవ్ డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని విద్యార్థులు ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఓబులేశు యాదవ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీఓ నెం. 77, ఎయిడెడ్ విద్యను నిర్వీర్యం చేసే జీఓలు 42, 35లను తక్షణమే రద్దు చేయాలన్నారు. బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ ధర్నాలో ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సాకే హరి, జిల్లా అధ్యక్షుడు శివ, వైవీయూ అధ్యక్షుడు కె.నరసింహులు, నగర అధ్యక్షులు వంశీ, కార్యదర్శి చెన్నకేశవులు, నాయకులు దినేష్, హరి, కిశోర్, సాయి, శ్రీనుతోపాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయంలో సోమవారం అగ్నిమాపక భద్రతా శిక్షణ, మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని అగ్నిమాపక సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక భద్రతా విభాగం అధికారులు అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్, మునేష్ మీనా పాల్గొన్నారు.

అభ్యసన వైకల్యాలను తొలి దశలోనే గుర్తించాలి

కడప ఎడ్యుకేషన్: అభ్యసన వైకల్యాలను తొలిదశలోనే గుర్తించి సరైన మార్గదర్శకత్వం ఇవ్వడం వలన ఉత్తమ అభ్యసన ఫలితాలను పొందవచ్చని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ వల్లూరు బ్రహ్మం పేర్కొన్నారు. కడప ఎర్రముక్కపల్లె బాలవికాస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో సోమవారం అభ్యసన వైకల్యాలు కలిగిన పిల్లలను గుర్తించేందుకు స్వీకార్ మల్టీ రిహాబిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లోని అభ్యసన వైకల్యాల్ని గుర్తించి వారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వల్లూరు బ్రహ్మం పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్వీకార్ మల్టీ రిహాబిలిటేషన్ స్టేషన్ సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణా రావు, పాఠశాల డైరెక్టర్ బి. గంగయ్య, రిమ్స్ ఫిజియో థెరపిస్టు డాక్టర్స్ పాల్గొన్నారు.

జంతువులను చంపిన నేరస్తుల అరెస్ట్

కడప అర్బన్ : చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పశువులను(మూగ జంతువులను) వధిస్తూ తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ ఓబులేసు తెలిపారు. చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్లో ఎస్సైలు రవికుమార్ రాజరాజేశ్వర్‌రెడ్డితో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇద్దరు నిందితుల వివరాలను తెలియజేశారు. కడప శంకరాపురం మున్సిపల్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న సార కుక్కల నగేష్, చెల్లూరు మండలం రామనపల్లికి చెందిన నేలటూరు చంటి చిన్న చౌక్ ప్రాంతంలో తిరుగుతూ ఆవు, ఇతర పశువులను వధిస్తూ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. జూన్ 12వ తేదీ రాత్రి శంకరాపురానికి చెందిన చంద్రశేఖర్ ఆవును మేత కోసం వదిలిపెట్టారు. ఆవు వెనుక భాగం సగం కట్ చేయడంతో మృతి చెందినట్లు తెలిపారు. దీంతో బాధితుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ నెల 6వతేదీన దేవుని కడప ప్రాంతంలో చంపి దాని అవయవాలను కోయడానికి ప్రయత్నిస్తూ ఉండడంతో ఇరువురి అదుపులోకి తీసుకొని విచారించగా వారు నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. ఇరువురు నిందితులు పశువుల మాంసం అమ్ముకొని సొమ్ము చేసుకునే, అలవాటు పడి నేరానికి పాల్పడుతున్నారన్నారు. కేవలం మాంసం అమ్ముకునేందుకు ఈ తప్పులు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి కత్తి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండుకు తరలించారు.